మూత్ర సంబంధమైన బాధకు లోనైన మా ఫ్రెండో కడు ఈ మధ్య గొట్టం పెట్టించుకున్నాడు. నేను చూడ్డానికి వెడితే అంతటి అసౌకర్యంలోను 'ఏముంది! గొట్టం తనపని చేసుకుపోతుంది!' అంటూ నన్ను నవ్వించాడు.

మెజారిటీ గంగిరెద్దు నాయాళ్ల సాయంతో మళ్లీ గద్దెనెక్కిన మన మం త్రులు కూడా ఏ కుంభకోణంలోనో పట్టుబడితే 'ఏముంది! చట్టం తన పని చేసుకుపోతుంది!' అనేస్తారు. 'దేవుడి పాలనలో భక్తుల్ని పట్టుకొనే వారె వరు!' అనేటంత ధీమాతో. ఇంతెందుకు, చనిపోయిన రోగి చెయ్యి పట్టు కునే డాక్టరయినా 'మళ్లీ ఇతనిలా కాకుండా చూసే పూచీనాదిగా!' అనే భరోసా యిస్తాడు! ఇలాంటివి వినడానికి బాగానే ఉంటాయి గాని ఆ సెగ మా వైపే తగులుతుందని కలలో అనుకోలేదు! కలలో మాటకేం గాని కథలోకి వస్తానిక. అది వివరించడానికి కాస్త ఉపోద్ఘాతం కూడా అవసరం మరి!



# చుట్టం తన పని చేసుకుపోతుంది!

## అవసరాల రామకృష్ణారావు

ఒకే యింట్లో ఉంటూ ఏళ్ళ తరబడి ఎడ మొహం పెడ మొహంగా ఉన్న మా దంపతుల్ని ఎలా అయితేనేం ఏక మొహం చేసింది. ఈ మధ్య మాతో కొద్దిరోజులు గడిపిన ఓ దూరపు చుట్టం. పిల్లల్నికనే వయసు దాటేక కూడా మా వేర్పాటువా దన పడకగదిలో మాత్రం పని చేసేది కాదు. అవన్నీ ఎందుకుగాని మేం దింపిన శాల్తీలు అరడ జను. పుట్టినవాళ్లు ఎద గక మానరు. ఎదిగాక 'మళ్లీ పిల్లల్ని పుట్టించండ్రా' అంటూ వాళ్లకి పెళ్లిళ్లు చెయ్యకా తప్పదు. ఇంత పెంట పెట్టుకున్నాక కేవలం జీతపు రాళ్ళే కైవల్యం అనుకుంటే ఎలా! పైరాబడి వృద్ధి చేసుకొనే సర్కారు నౌకిరీ అంటే ఏమిటి? ఆ టెక్నిక్కు మారుపైట వేసుకొనే వారాం గన లాంటిది కద!


అందుకే పెద్దపెద్ద కట్నాలిచ్చి ముగ్గురాడ పిల్ల లకీ గొప్ప గొప్ప సంబం ధాలు తేగలిగాను. మగపి ల్లలు మాత్రం నాకంటె ఘనులనిపించు కున్నారు. తెచ్చిన కట్నం డబ్బులు నాకు అంద కుండా ఎవరి ఖాతాలో వారు జమ అయ్యే ఏర్పాటు ముందే చేసుకున్నారు. కన్న పిల్లలు గడుసు వాళ్లూ గడన తెలిసిన వాళ్లూ కావాలని ఏ తల్లితండ్రులైనా కోరుకుం టారు. ఈ రోజుల్లో వాళ్ల బతుకు వాళ్లు బతికితే చాలని వెయ్యి దేవుళ్లకి మొక్కు కుంటారు. ఆడామగా అనకుండా అందరూ ఉద్యోగాలు వెలి గిస్తున్నారు. ఎప్పుడోగాని మమ్మల్నొచ్చి చూడ్డానికి కూడా వాళ్లకి టైముం డదు. కర్మం చాలక వచ్చారో, అల్లుళ్లూ కోడళ్లూ కాదు సుమండీ, కన్న పిల్లలే చేతికి ఏదిదొరికితే అది గెద్ద తన్నుకుపోయినట్టు తన్నుకు పోతారు. మా తదనంతరం ఇల్లూ పొలమూ ఆరు సమాన వాటాలుగా ఎప్పుడో రాయించేసుకు న్నారు. ఇక ఇంట్లో మిగిలినవి వెండో బంగా రమూ. అది కూడా మిగుల్చుకోకపోతే ఎప్పుడేం అవసరం వస్తుందో చెప్పలేం కదా!

నిత్యం కొట్టుకు చచ్చేమేము ఓ విషయంలో మాత్రం రాజీకీ రాక తప్ప లేదు. పిల్లలు యిలా వస్తారని తెలిసీ తెలియగానే మా జానకి పసుపు తాడు, పచ్చకొమ్ముతోనూ నేనైతే వెలిసిన రంగు చొక్కా, చిరిగిన పంచెతో సిద్ధమైపోతాం. 'పింఛెను రాళ్లు తప్ప ఇంకా మీ కివ్వడానికి మా దగ్గిరే ముందీ బొంద!' అనే బిల్డప్‌తో.

అయినా అంతర్జాతీయ మంత్రాంగం అలవర్చు కున్న ప్రతిభాశాలురు కదా మా వాళ్లు! నా జీత

మెంతో ఫైమేంత ఏమిటో, ఇంట్లో ఉన్న వెండీ బంగారాల విలువ ఏ పాటిదో ఆ మాత్రం అంచనా వెయ్యలేని అజ్ఞానులా వాళ్లు! ఎక్కడో దాచేశామని పోల్చే ఉంటారు. అందుకే ఓసారి పండక్కి వచ్చిన పుడు పంచాయతీ లాంటిది పెట్టేరు: 'మాకు కావ లిసినవన్నీ యిచ్చి ఇంతవాళ్లని చేశారే అమ్మా! ఎంతో రుణపడి ఉంటాం. అదే చేత్తో మరొకటీ చేస్తే నిన్నూ నాన్ననీ యీ జన్మలో మరచిపోం. వెండీ బంగా రమూ కూడా ఎంతుందో ఇప్పుడే ఓ మాట అనుకుని వాటాలు వేసేస్తే ఆ తర్వాత మాలో మాకు పేచీలురావు కదా!' అనే అభిప్రాయాన్ని నలు గుర్నీ కూర్చోపెట్టి ప్రకటించారు.

అన్నీ అదివరకే మీ చదు వులకీ పెళ్లిళ్లకే కైంకర్యం అయి పోయాయనీ, అలాంటివి




మాటవరసకైనా యింట మిగల్లేదనీ జాన కితో పాటు నేనూ వంత పాడేను.

'ఉంటే మాత్రం ఇంత మందిలో చెప్పు కుంటారా మనకి కాక మరెవరికైనా యిచ్చు కుంటారా! ఏమే పెద్దక్కా!' అనే మా రెండో అబ్బాయి తీర్పుతో అక్కడ తుపాను వెలిసింది. ఎక్కడి వాళ్లక్కడికి తప్పుకున్నారు.

ఇంతకీ నోట్ల కట్టల్ని ఎంత చిన్నజాగాల్లోనైనా నొక్కెయ్యవచ్చు గాని ఈ లోహపు సరుకుతోనే ఎక్కళ్లేని పేచీ! ఇద్దరం జాగ్రత్త మంతులం గనక పిల్లల మీద ఎంత ఖర్చుపెట్టినా ముడుపుల ధర్మమా అని ఎప్పటికప్పుడు ఇల్లు నిండుతూనే ఉంది. రెండేళ్లై రిటైరయినా పెద్దరోగాలేవీ పీడించ లేదు గనక దేనికీ తడుముకోవలసిన అవసరం లేకుండా గడుస్తోంది. పిల్లలు ఊహించిన వెండి బంగారాల నిలవ విషయం నిజమే. ఇది కూడా ఇప్పుడే వాళ్ల చేతిలో పెట్టేస్తే రేపేదైనా అవసరం వస్తే మా బతుకేం గాను! కడుపున పుట్టిన పిల్లల కంట పడకుండా ఇలాంటివి దాచుకోవలసిన దుర వస్థ వస్తుందని జన్మలో అనుకోలేదు. కూడ బలు క్కుని కుదవ బెట్టుకుందా మంటే మా కిద్దరికీ ఒక్క టంటే ఒక్కమాట పడి చావదు కద! అయినా ఎక్క డికక్కడే సంతోషించాలి. వేరువేరు పద్ధతుల్లోనే ఎవరి మటుకు వారు పరమానందం పొందడం అలవాటు చేసుకున్నాం.

మొదట చెప్పవలసింది జానకి పూజా విధానం. ఏ పదింటికో దాసీది వెళ్లిపోతుంది. అది వెళ్లగానే జానకి వీధి తలుపు వేసేసి సందులోంచి పెరట్లోకి వచ్చి ఇంట్లో ప్రవేశిస్తుంది. పెరటి తలుపు లోపల వైపు తాళం పెట్టి మరీ పూజ గదిలోకి వస్తుంది. దేవుడి గదిలో లోపల కూడా గడియ పెట్టుకుం టుంది. ఇంకో గంట గంటంపావో అయితే గాని ఆ తలుపు తియ్యదు. ఇంత సేపు లోపల ఏం చేస్తుం దని ఎవరైనా అనుకోవచ్చు గాని నాకు మాత్రం యిక్కణ్ణుంచి చూస్తున్నట్టే. దేవుడి సింహాసనం కింద పెద్ద సొరుగు తాళంతీసి అందులో ఉన్న వెండి సామాన్లు ఒకటీ ఒకటీ ఇవతలకి లాగు తుంది. పన్నీరు బుడ్డి, గంధం గిన్ని, కుంకుమ భరిణ, హారతి పళ్లెం, తాళం చిప్పలు, రక రకాల పళ్లేలు, పెద్దాచిన్నా చెంబులు, దీపపు సెమ్మలు అన్నీ లెక్కపెట్టు కుని, మిలమిల లాడేలా



తోముకుని, కడుక్కుని, తుడుచుకుని ఉపయోగిం చుకుని మళ్లీ సొరుగులో పెట్టి తాళం వేసుకుని బొడ్డున దోపుకుంటోంది. పతివ్రతా శిఖామణి అయిన నా భార్యామణి దైవాన్ని కోరేకోరిక నేను ఊహించగలను. 'ఇంకో జన్మంటూ ఉంటే ఇలాంటి మొగుణ్ణి మాత్రం ఇవ్వొద్దు దేవుడోయ్' అని అయి

ఉంటుంది. అన్నట్టు నూట ఎనిమిది వెండి పువ్వుల మాట మరచిపోయా నండోయ్!

ఇక నేను నాగదిలో తీర్చుకునే ముచ్చటా ఇక్కడ చెప్పకపోతే నా మగ తనం ఏం కాను! దానికంత వెండిమీద మోజయితే నా బంగారం సరదా నేనేం దుకు తీర్చుకోక పోవాలి! కర్ర బీరవాలో అమర్చి ఉన్న నిలువుటద్దం ముందు చేరతాను. చేతి వేళ్ల సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటే బావుణ్ణనిపిస్తుంది. పదివేళ్లకీ పసిడి ఉంగరాలు పెట్టేసుకుంటాను. పచ్చటి బంగారం గొలుసు మెళ్లో వేసుకు చూసు కుంటాను. ఆ చేతికి బంగారు చెయిను వాచీ కాక ఇటువైపు రిస్టుకి బ్రేస్‌లెట్. ఇవన్నీ పెట్టుకుని నా ప్రతిబింబం చూసుకుని గ్రేస్‌ఫుల్‌గా మీసం తిప్పు కుంటే అదో రకం హాయి. తృప్తి తీరా ఎంజాయ్ చేసి మూడో కంటి వాడికి తెలీని చోట అన్నీ సర్దే స్తాను.

ఈ వయసులో ఇలాంటి భ్రాంతి మంచిది కాదని చెప్పడానికన్నట్టు వారం రోజుల కిందట మా యింటికో చుట్టం దిగింది.

తలుపు తీసేదాకా గడువు ఇవ్వకుండా దడ దడా బాదడం, వినేవాళ్లు ఊపిరి తీసుకోడానికి అవ కాశమైనా ఇవ్వకుండా లొడలొడా వాగడం, ఆవిడ లక్షణం. అంతేకాదు, మా యిద్దర్నీ ఓ చోట కూచో బెడితే గాని ఆవిడ నోరు విప్పదు. మాకంటే పెద్ద దైనా మా యిద్దరి కంటికీ మహాచురుకుగా కనిపిం చడం మమ్మల్ని కట్టి పడేసిందనుకుంటాను.

ఏ దూరపు చుట్టాలో పెంచి పెద్దచేసి మాకిద్దరికీ పెళ్లి చేశారు గానీ నేనూ జానకీ పుట్టుకతో అనా థలం. మా కడుపున పుట్టిన పిల్లలైనా ఓ నాడూ మమ్మల్ని ప్రేమతో పలకరించి ఎరగరు. మమ్మల్ని ద్దర్నీ విడదీసి ఏదైనా పొందుదామని చూశారు గాని ఇలా కలిపి కబుర్లు చెప్పడం ఎప్పుడు ఎరగం. వెండీ బంగారాల కంటె ఇలాంటి ఆత్మీయత బతు కులో ఎంత వెలుగు నింపగలదో చెప్పడానికి రెండ్రోజుల్లోనే వికసించిన మా మొహాలే రుజువు.

ఓ పెద్ద లెదర్ జిప్ బ్యాగు పట్టుకుని ఓ నాటి మిట్టమధ్యాహ్నం మా యింట్లో అడుగు పెట్టిందా విడ. గ్లాసుడు మంచినీళ్లు అడిగి పుచ్చుకుని గట గటా తాగి మొదలెట్టింది.

'అలా వెర్రి మొహాలేసుకు చూస్తారేమర్రా! నేనూ, పేరమ్మ పిన్నిని. మా చినమామయ్య సోమే శ్వరమని ఉండేవాడు, గుర్తు లేదూ, ఆయన పెద్ద కోడల్ని. నీకైనా గుర్తులేదటే అమ్మలూ, పదేళ్లు గడిచి రాకపోకలు బంద్తై నంత మాత్రాన ఇలా గుర్తు పట్టకుండా అయిపోతామా!'

చల్లని వాన కురిస్తే దాన్ని నువ్వెవరివే, ఎక్క ణ్ణుంచి వచ్చావే అని అడగ బుద్ధి వెయ్యదు కద. పేరమ్మ పిన్నిని చూస్తే అలాగే అనిపించింది. పట్టు చీరా, వంటెడు నగలూ చూస్తే దండం పెట్టవలసిన పెద్ద ముత్తైదువలా ఉంది – ఎందుకొచ్చిందో ఏమో... మేం అడక్కుండానే చెప్పేసింది.

భగవంతుడి దయవల్ల తన కుటుంబం అన్నివి ధాల ఎత్తిరిల్లిందట. మొగుడు పిల్లలూ కంటికి రెప్పలా చూసుకుంటారుట. ఎప్పట్నుంచో తీర్థ యాత్రలు చెయ్యాలని కోరికట. ఈ వయసులో తనెక్కడ కందిపోతానో అని పంపరట. అలాకాదని ఏదో వంకపెట్టి ఒక్కర్తీ ఇలా వీధిన పడిందట. దార్లో సాటిబంధువు లెవరైనా కనిపిస్తే ప్రాణం లేచి వస్తుందిట. రెండ్రోజులక్కడ గడిపి ముందుకి సాగు తుందిట.

'అన్నట్టు అన్నవరం సత్యన్నారాయణస్వామి ప్రసాదం తెచ్చాను. బంధువులకి మొహం వాచి మీ యిద్దరూ కంటపడగానే మరచి పోయాను. ఎంత అపచారం!'

అంటూ లెంపలేసుకుని ఆ విస్తరాకు పొట్లాం మా జానకికి ఇచ్చింది. దాన్తో పాటే ఓ అరకేజీ నల్ల ద్రాక్ష పళ్ల పొట్లమూ యిచ్చి 'కడిగి ఫ్రిజ్‌లో పెట్టమ్మా ఓ గడీ ఉన్నాక రసం తీసుకు తాగుదాం' అంది. మరుక్షణం 'ఓ దిండు ఉంటే పడెయ్యవే అమ్మలూ, ప్రయాణపు బడలిక కదా ఓ చిన్న కునుకు తీస్తాను' అంటూ తలగడ మీదకి తలచేర్చి అయిదు నిమిషాల్లో అదే గుర్రు పెట్టడం! మా కిద్ద రికీ నోటమాట రాలేదు. రక్త సంబంధీకుల్నే నమ్మని దుస్థితిలో బితుకు బితుకుమంటూ, కనబడని దాన్ని వెతుకుతూ కాలక్షేపం చేస్తున్నాం. ఇప్పుడే మొట్టమొదటిసారిగా ఈవిడ మమ్మల్ని కలిసింది. పెద్ద బ్యాగుమాట అలాఉంచి బండెడు నగలెట్టు కుని అన్నీ కొత్త మనుషులం మాకప్పచెప్పి నిష్టూ చీగా నిద్దరోతోంది! సాటిమనిషి మంచి తనం మీద ఆవిడకెంత నమ్మకం! ప్రపంచమంతా యిలా ఉంటే ఎంత బావుణ్ణు! పేరమ్మ పిన్నికి నిద్రాభంగం అవ కుండా మేం యివతలి గదిలో కొచ్చి ఆ సంగతే మాటాడుకున్నాం. చాలారోజుల తర్వాత మేం కాస్త సుముఖంగా ఉన్నది అప్పుడే.

ఉన్న వారం రోజులూ అలా అలా మా మధ్య ఏర్పడిన కృత్రిమ అంతరం క్రమక్రమంగా తొల గేలా కాంతులు నింపింది పేరమ్మ పిన్ని. ఈ రోజుల్లో అవసరముంటే తప్ప ఎవరైనా ఇంకొకరి గుమ్మం తొక్కరు. ఇంకొకరి మీద నేరాలో, మనపట్ల పొగడ్తలో కుమ్మరించి కావలసింది పొందుతారు. ఈవిడ ప్రవర్తనలో యిలాంటిది మాటవరసకైనా కనిపించలేదు. ఏదైనా ఫ్రీగా అడుగుతుంది, చెబు తుంది.

అన్నిటికన్న అంతవయసు ఉన్నా ఒక్కక్షణం కూర్చోడం ఆవిడ వల్ల కాదు. మా ఆవిడ పూజకి పువ్వులు కోసి యిచ్చేది. ఆఖరికి నా గదికి వచ్చి కర్ర బీరవా వెనక బూజులు సహా దులిపేది. చెప్పే కబురూ చెప్పని కబురూ లేనంతగా దగ్గిరయి పోయాం, పేరమ్మ పిన్నికి మేము. ఆవిడా అలాగే ఉంది కద. ఏదైనా ఇచ్చి పుచ్చుకోడంలోనే ఉంటుంది మరి.

'కొంపతీసి ఈవిడ వెళ్లి పోదు కద!'


అనేటంత బంధుత్వాన్ని పెంచుకున్నాం.

అయినా పరాయి ఆవిడ ఎన్నాళ్లుంటుంది!

ఓ రాత్రివేళ ఎలా వచ్చింది అలా వెళ్లిపోయింది.

ఇన్నాళ్లూ మేం ఏం కోల్పొయేమో ఆవిడ వెళ్లే దాకా తెలీలేదు. వెళ్లి పోయాకే ఏం పోగొట్టుకు న్నామో తెలిసింది.

'ఏదో వచ్చాను వెడుతున్నాను. పెద్దదాన్ని. నా కింత కలిగింది యిస్తు న్నాను కాదనకండి' అంటూ ఎంతవారిస్తున్నా వినక చెరో వెయ్యి రూపా యల నోటు యిచ్చింది. మర్నాడు మార్చుకుందామని బ్యాంకుకి వెడితే అవి దొంగనోట్లని తేలింది. ఆవిడి చ్చిన ఎడ్రసుకి ఫోన్ చేస్తే అలాంటి పేరు గల మని షెవరూ లేరనే సమాచారం అందింది. ఇంటికొచ్చి చూసుకుంటే వెండి బంగారాలు మాయమయ్యా యని తెలిసింది. లబోదిబో మనడం లోనే ఈసారి మేం ఒకటి అయాం!




రచయిత సెల్ నెం: **98662 21575**